www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 23 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య



మల్లెల గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి హెచ్చరించారు. పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామ పంచాయతీ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎ.గిరి, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో డబ్బు తక్కువగా వచ్చిందని, తర్వాత ఇస్తానని చెప్పి దాదాపు 8 నెలల పాటు కొంతమంది వృద్ధులకు పింఛను ఇవ్వకుండా మోసం చేసిన ఘటనపై ఎంపిడిఒను నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. వృద్ధులకు పింఛన్లు ఇవ్వకుండా మోసం చేసింది నిజమేనని ఎంపిడిఒ ఖరారు చేస్తూ కలెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి నివేదికను సమర్పించారు. దీని ఆధారంగా వెల్ఫేర్ అసిస్టెంట్ గిరిని తక్షణమే సస్పెండ్ చేస్తూ ఎంపిడిఒకు తగిన చర్యలు తీసుకుని నివేదికను పంపాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేనిదే గిరి, గ్రామాన్ని విడిచి వెళ్లరాదని ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పథకాలలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జగన్ సర్కారు పోయి, బాబు ప్రభుత్వం వచ్చినా ప్రజలకు విద్యుత్ షాకులు తప్పడం లేదని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ మంగళవారంపట్టణంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాకముందు విద్యుత్ భారాలను ప్రజలు మోయలేకపోతున్నారని, మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తగ్గిస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా, తగ్గించకపోగా ఈ కాలంలో రూ.15,450 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. బాదుడే బాదుడు పేరుతో రాష్ట్ర మొత్తం తిరిగిన తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పుడు మాత్రం ధరలు పెరుగుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లు వ్యవసాయానికి, గృహాలకు బిగించడం దుర్మార్గమన్నారు. ప్రజలు, రైతులు ఎవరూ పాత మీటర్ల స్థానంలో, స్మార్ట్ మీటర్లు బిగించాలని అడగకపోయినా కోట్లాది రూపాయల భారాలను ప్రజల మీద వేసి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చి పెడుతున్నారని అన్నారు. ఎక్కువ మంది ఏ సమయంలో విద్యుత్తు వాడుకుంటారో ఆ సమయంలో యూనిట్ ధరలు పెంచే, టైమ్ ఆఫ్ డే విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలని, విద్యుత్ భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి, స్థానికులు సాయికిరణ్, రమేష్ రాయల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

లెనిన్ ఆశయాలను కొనసాగించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికుల శ్రమ దోపిడీ నుండి విముక్తి కలిగించి పెట్టుబడి దారుల రాజ్యాన్ని కూల్చిన ప్రథమ సోషలిస్ట్ రాజ్య నిర్మాత లెనిన్ కార్మిక వర్గానికి స్ఫూర్తి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో లెనిన్ 155వ జయంతి సందర్భంగా అంగన్వాడీలు, మున్సిపల్, ఇతర కార్మికులు లెనిన్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వారు లెనిన్‌ను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య సంఘటన నిర్మాణంలో ఎత్తుగడలే కీలకమని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతాంగం మధ్య ఐక్య సంఘటనను లెనిన్ ప్రతిపాదించారని తెలిపారు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ తీవ్రతరం అయ్యేకొద్దీ నష్టపోతున్న పీడిత తరగతులే కార్మిక వర్గ స్వభావాన్ని సంతరించుకుంటారని చెప్పారు. వారే ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాడతారన్న లెనిన్ కార్మిక కర్షిక ఐక్యత గురుంచి, విప్లవ కార్యాచరణలో కార్మిక వర్గ అగ్రగామిగా పార్టీ నిర్మాణ ఆవశ్యకత గురుంచి లెనిన్ నొక్కి చెప్పారని తెలిపారు. ప్రపంచ వ్యాపిత పెట్టుబడి దారి వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న తీరును కార్ల మార్క్స్ వివరిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ, గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్య వాద వ్యవస్థగా అభివృద్ధి చెంది ఫైనాన్స్ పెట్టుబడిగా దాని రూపాంతరం ఎలా మార్పు చెందుతుందనే క్రమాన్ని లెనిన్ వివరించారన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల వనరులను, సంపదను దోచుకోవడమే సామ్రాజ్య వాద దేశాల స్వభావం అని నొక్కి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ, కోశాధికారి సి. రాంబాబు అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు వి సిద్దమ్మ మున్సిపల్ వాటర్ సెక్షన్ అధ్యక్షులు యస్ అక్బర్, రమేష్ రమణారెడ్డి, పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: రష్యన్ విప్లవకారుడు లెనిన్, కార్మిక వర్గానికి శ్వాస వంటి వారని ఆయన జయంతిలో విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక బాస్ కార్యాలయంలో లెనిన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం శివప్రసాద్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్ రచించిన అనేక గ్రంధాలను చదవడంతో పాటు 'కమ్యూనిస్టు ప్రణాళిక' రష్యా భాషలోకి అనువదించి, మార్క్స్ ఇజం సారాన్ని కార్మికులకు సులభంగా, క్లుప్తంగా, చర్చల ద్వారా, సంఘటనల ద్వారా వివరించడం కోసం స్టడీ సర్కిళ్లను నిర్వహించిన కార్మిక వర్గ విముక్తి పోరాట యోధుడు లెనిన్ అని పేర్కొన్నారు. లెనిన్ స్ఫూర్తితో సమాజ హితం కోసం పోరాడటమే, ఆయనకు మనమిచ్చే సిసలైన నివాళని కొనియాడారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, బ్యాంక్ రెడ్డెన్న, గాయకుడు రెడ్డెప్ప, విసికె పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బురుజు రెడ్డిప్రసాద్, బాస్ నాయకులు సింగన్న, ఆర్.నారాయణ, డేగాని రమణ, జి.వి.రమణ, రెడ్డిశేఖర్, ఈశ్వర్, బైనేని సురేష్, రవి, నాగరాజు పాల్గొన్నారు.



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేరాల నియంత్రణకు చర్యలు : డిఎస్‌పి



మదనపల్లె : కార్డన్ సర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. మంగళవారం తెల్లవారుజాము ఐదు గంటలకే పట్టణంలోని శివాజీ నగర్ ప్రాంతంలో డిఎస్‌పి ఆధ్వర్యంలో వన్ టౌన్ సిఐ, టూ టౌన్ సిఐ రామచంద్ర, బి.కొత్తకోట సిఐ జీవన్ బాబు, సబ్ డివిజన్ పరిధిలోని 8 మంది ఎస్ఐలు, 88 మంది పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీలతో దాదాపు రెండు గంటల పాటు అనుమానిత ప్రదేశాలలో తనిఖీలు చేశారు. రికార్డులు సక్రమంగా లేని 22 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. శివాజీ నగర్ ప్రాంత ప్రజలకు శాంతి భద్రతల విషయంలో అనుసరించ వలసిన విధి విధానాల గూర్చి డిఎస్‌పి తెలిపారు. అక్రమ నాటు సారా, అక్రమ మద్యం, గంజాయి, జూదము వంటి వాటిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు సరైన రికార్డులు కలిగి ఉండాలని, ప్రయాణించే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వేసవి సెలవుల సందర్భంగా ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు నగదును ఉంచి బయట ఊర్లకు వెళ్లవద్దని తెలిపారు. ఏదైనా బ్యాంకు లాకరులో భద్రపరుచుకోవాలని, మహిళలు ఒంటరిగా వాకింగ్ వెళ్లకూడదని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు మీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించినప్పుడే పూర్తి స్థాయిలో నేరాలను అదుపు చేయగలమని వివరించారు.

పీలేరు: పట్టణంలోని బండ్లవంక ప్రాంతంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు అర్బన్ సిఐ యుగంధర్ తెలిపారు. ఎస్ఐలు లోకేష్, బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా ఈ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ సమయంలో అనుమానాస్పద వ్యక్తులు, వారి ఇళ్లను నిశితంగా తనిఖీ చేశామన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేని సుమారు 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వాటి చట్టబద్ధత, యజమానుల గుర్తించేందుకు విచారణ చేపట్టామని తెలిపారు.

స్కౌట్ శిక్షణతో బంగారు భవిష్యత్తు : డిఇఒ



విద్యార్థులతో డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులలో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం(స్కౌట్స్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం పట్టణం కో-ఆపరేటివ్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్కౌట్ నూతన యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలోని ప్రాథమిక పాఠశాలలో మొట్టమొదటిసారిగా కబ్ (బాలురు), బుల్ బుల్ (బాలికలు) యూనిట్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు చొరవ చూపిన ఫ్లాక్ లీడర్ ధనలక్ష్మికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, పాఠశాల హెడ్ టీచర్ వీరమ్మ, యూనిట్ లీడర్ మడితాటి ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ వహీదా, ఉపాధ్యాయులు వెంకటయ్య, రాధమ్మ, విమల కుమారి, చెంచు రెడ్డి, లీలావతమ్మ, సరితమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



చమర్తిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

కలిసికట్టుగా పనిచేద్దాం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అందరం కలిసి కట్టుగా పని చేసి రాజంపేటలో టిడిపి జెండా ఎగరవేద్దామని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. మంగళవారం మేకవారిపల్లి, కొల్లావారిపల్లి, మిట్టమీదపల్లెకు చెందిన టిడిపి ముఖ్య నాయకులు ఆయనను కలిసారు. ఈ సందర్భంగా చమర్తిని టిడిపి శ్రేణులు ఘనంగా సన్మానించారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ టిడిపిలో నాయకులు, కార్యకర్తలకు సముచిత గౌరవం ఎప్పటికీ ఉంటుందని, వారే పార్టీకి వెన్నుముక లాంటివారని తెలియజేశారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ అందరం కలసి కట్టుగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో టిడిపి సత్తా చాటాలని, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటామని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి, కార్యకర్తల గౌరవానికి అండగా ఉంటామని చెప్పారు. అందరం కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ టిడిపి మండల అధ్యక్షులు కొండయ్య నాయుడు, బాపనయ్య నాయుడు, బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, నాగినేని నాగేశ్వర్ నాయుడు, మాజీ ఎంపిటిసి గుడారు సుబ్రహ్మణ్యం నాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సురేష్ రాజు, మిట్టమీదపల్లి ఉప సర్పంచ్ నాగినేని నరసింహనాయుడు, కొల్లావారిపల్లి ఉప సర్పంచ్ మేక నరసింహ నాయుడు, మేక రమణ, మేడికొండు రవికుమార్ నాయుడు, డాక్టర్ దగ్గుపాటి నవీన్ నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంత నాయుడు, కూచివారిపల్లె ఉప సర్పంచ్ మల్లిఖార్జున నాయుడు, పోలిచెరువు నీటి సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్ నాయుడు, చంద్రబాబు, నాగినేని దివాకర్, విష్ణు, గుడారు చందు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిహెచ్ఒలను క్రమబద్ధీకరించాలని నిరసన

ప్రజాశక్తి-రాయచోటి

వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సిహెచ్ఒలుగా పని చేస్తున్నామని, రెండేళ్ల జీతాభాత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, ఆరేళ్లు దాటిన సిహెచ్ఒలను క్రమబద్ధీకరించాలని ఎపిఎంసి జిల్లా నాయకులు సాల్మోహన్ రాజు, భరత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సిహెచ్ఒలుగా పనిచేస్తున్న గత 2 సంవత్సరాలుగా జీతాభాత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాంన్నారు. మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన శాంతియుతమైన నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రం పరిధిలోని సిహెచ్ఒలు అందరం కలిసి ధర్నా చేపట్టామన్నారు. ఆరేళ్లు దాటిన సిహెచ్ఒలను క్రమబద్ధీకరించాలిన్నారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలిని తెలిపారు. ప్రతి నెల శాలరీతో పాటు ఇన్సెంటివ్ ఇచ్చి, ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఆర్థికమైన, ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిఎంసిఎ జిల్లా నాయకులు శివకుమార్, అహ్మద్ బాషా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిహెచ్ఒలు

టపాసుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలోని టపాకాయల దుకాణాలను పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారుల బృందంతో కలసి తనిఖీలు చేసినట్లు తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. ఇటీవల అనకాపల్లి సమీపంలో ఓ టపాకాయల తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న ఘటనను దృష్టిలో ఉంచుకుని, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖలు సంయుక్తంగా పట్టణంలోని టపాకాయల నిల్వ, విక్రయ కేంద్రాల్లో చేపట్టిన అగ్నిమాపక నివారణ చర్యలపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ భీమేశ్వరరావు స్థానికంగా కడప రోడ్డులోని ఓ టపాకాయల దుకాణాన్ని, మండల పరిధిలోని బోడుమల్లువారిపల్లి సమీపంలో మరో టపాకాయల దుకాణాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. టపాకాయల విక్రయ కేంద్రాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా వారు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలపై ఆరా తీశామని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలో కూడా వారికి సూచించినట్లు తహశీల్దారు చెప్పారు. టపాకాయల దుకాణాల యాజమాన్యాలు తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో తనతోపాటు కార్మిక శాఖ అధికారి ఆనంద్ బాబు, ఎస్ఐ బాలకృష్ణ, అగ్నిమాపక అధికారి మస్తాన్, రెవెన్యూ, సచివాలయ, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



టపాకాయల దుకాణం బయట పరిశీలిస్తున్న బృందం

సివిల్స్‌లో మెరిసిన కడప జిల్లా వాసులు

ప్రజాశక్తి-చెన్నూరు/కడప టౌన్



శ్రీకాంత్‌రెడ్డి 151వ ర్యాంకు



ధనుష్ 232వ ర్యాంకు

అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యుపిఎస్‌పి నిర్వహించిన సివిల్స్-24 పరీల్లో కడప జిల్లాకు చెందిన ఇద్దరు మెరిశారు. చెన్నూరుకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి 151వ ర్యాంకు, కడప నాగరాజుపేటకు చెందిన ధనుష్ 232వ ర్యాంకు సాధించారు. చెన్నూరు చెందిన నేలటూరు శ్రీకాంత్‌రెడ్డికి సివిల్స్‌లో 151వ ర్యాంకు సాధించి సత్తా చాటించాడు. గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి కుమారుడు మొదటి రెండు ప్రయత్నాలు సివిల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ పాసయ్యాడు. తాజా సివిల్ ఫలితాల్లో 151వ సాధించాడు. ఇండోర్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. సివిల్స్‌లో ర్యాంక్ సాధించినందుకు తల్లి దండ్రులు, బంధువులు అభినం దనలు తెలియజేశారు. కడప నగరంలోని నాగరాజుపేటకు చెందిన పూల ధనుష్ ఆల్ ఇండియా సివిల్ సర్వీస్‌లో 232వ ర్యాంక్ సాధించారు. 2023 సివిల్స్ ఫలితాల్లో ధనుష్‌కు 480 ర్యాంకు సాధించారు. ఐడిఎఎస్ సర్వీసెస్‌లో ప్రొబిషనరీ ఆఫీసర్‌గా సిమ్లాలో పనిచేస్తున్నారు. పట్టువదలకుండా రెండో సారి సివిల్స్‌లో ధనుష్ ఉత్తమ ప్రతిభ చూపారు. 232వ ర్యాంకు సాధించారు. పూల ధనుష్ తల్లితండ్రులు పూల శ్రీనివాసులు, తల్లి నాగమణి, పెదనాన్న చలపతి బిసి వెల్ఫేర్ అధికారి. ధనుష్ తల్లితండ్రులు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రి ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్, తల్లి రైల్వేలో అకౌంట్స్ అడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. పూల ధనుష్ ఆల్ ఇండియా సివిల్ సర్వీస్‌లో 232 ర్యాంక్ సాధించినందుకు బంధువులు, సన్నిహితులు అభినందనలు తెలియజేశారు.



ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధరిత్రి, ప్రకృతిని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-పీలేరు

ధరిత్రిని, ప్రకృతిని పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ విజి నటరాజన్ తెలిపారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవ వేడుకలను మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పుడమి తల్లిని కాపాడుకోవలసిన ఆవశ్యకత మనందరికీ ఉందని అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని కాపాడాలని, జంతువులు, పక్షిజాతిని రక్షించాలని పిలుపునిచ్చారు. కొందరు ప్రక్రుతికి ప్రమాదం కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నల్లమందుతో తయారయ్యే వస్తువులను వినియోగిస్తున్నారని, వీటిని పూర్తిగా బహిష్కరించాలని కోరారు. ఉన్న చెట్లను కాపాడుకుంటూ ప్రతి ఒక్కరు మరిన్ని చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణకు, జీవకోటి మనుగడకు తోడ్పడాలని తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించి, విద్యార్థుల చేత భూమిని కాలుష్యాలనుంచి కాపాడుకోవాలంటూ నినాదాలు చేయించారు. పుర ప్రముఖులకు ధరిత్రి దినోత్సవ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్.జి.సి సమన్వయకర్త మురళి, ఉపాధ్యాయులు గౌస్, జనార్ధన రెడ్డి, ఎర్రయ్య, రమణా రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ జి.శ్రీరాములు, శసీదేవి, నాగవేణి, షరీఫున్నిస, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలను తొలగించడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి రాయచోటి

దళితులకు ఎక్కడా అన్యాయం జరగరాదని జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబందించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లను ఆర్‌డిఒను అడిషనల్ ఎస్పీని డీఎస్పీలను ఆదేశించారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిస్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఆఖరి శనివారం రోజున సివిల్ రైట్స్ డే తప్పకుండా జరిపి దానికి సంబంధించిన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక రుగ్మతలను దూరం చేసి అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా సమాజంలో సమానత్వం పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాష్ వివరించగా ఆయా శాఖల నుండి హాజరైన అధికారులను కలెక్టర్ సంబంధిత అంశాలపై వివరంగా అడిగి తెలుసుకున్నారు. చాలా అంశాలు పరిష్కరించబడ్డాయని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్ఒ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, రాజంపేట, మదనపల్లె డివిజన్ల డిఎస్‌పిలు, డివిఎంసి కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వైభవంగా బోయకొండ గంగమ్మ జాతర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని బుగ్గకాలువ బోయకొండ గంగమ్మ జాతర మంగళవారం కోలాహలంగా ప్రారంభమైంది. తొలి పూజలో మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఎస్.ఎ.కరీముల్లా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు నిస్సార్ అహమ్మద్, కరీముల్లాలకు పూలమాలలు వేసి, దుశ్శాలువతో సన్మానించారు. అమ్మవారికి అభిషేకాలు, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న వారు అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం భక్తుల పూజలు అందుకునే గంగమ్మకు ప్రతి ఏటా వైభవంగా జాతర నిర్వహించడం ఆనవాయితీ వస్తోందన్నారు. పట్టణ ప్రజానీకం శుభకార్యాలు తలపెట్టిన సమయంలో గంగమ్మను దర్శించుకుంటారన్నారు. జాతర సందర్భంగా మదనపల్లె చుట్టు పక్కల ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హరి, లక్ష్మీదేవి, యూనస్, పవన్ తేజ, రవితేజ, వేణుగోపాల్‌రెడ్డి, మహేష్, మల్లికార్జునరెడ్డి, శారద, నాగమణి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సివిల్ జడ్జిగా సుయోధన్ నియామకం

ప్రజాశక్తి - రాయచోటి

నెల్లూరుకు చెందిన టి. సుయోధన్‌ను రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా హైకోర్టు నియమించింది. గతంలో రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ పనిచేసిన అసిఫా సుల్తానా సీనియర్ సివిల్ జడ్జిగా ప్రమోషన్‌పై ఫిబ్రవరిలో వెళ్లిన తర్వాత ఇక్కడ పోస్ట్ ఖాళీగా ఉంది. మంగళవారం హైకోర్టు విడుదల చేసిన లిస్టులో రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నెల్లూరు కోర్టులో పనిచేసిన టి. సుయోధన్‌ను నియమించారు. మే రెండో తేదీ లోపల ఆయన విధుల్లో చేరాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

భూ రీసర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో జరుగుతున్న భూ రీసర్వేకు రైతులు, ప్రజలు సహకరించాలని తహశీల్దార్ రామాంజులు పేర్కొన్నారు. మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీలో మంగళవారం భూ రీసర్వే పై కస్పాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రీ సర్వేపై గ్రామ సచివాలయం వద్ద గ్రామ నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూమి వద్ద ఉండి సరిహద్దులు చూపించి రీసర్వేకు సహకరించాలని కోరారు. రీ సర్వేకు ఎలాంటి అపోహలు వద్దని తమ ఎదుటనే తమ భూమి కొలతలు వేస్తారని రైతులు దగ్గర ఉండి భూమి కొలతలు చూసుకోవాలని ఆయన కోరారు. గ్రామాలలో రీసర్వేకి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐఒఎస్ ప్రసాద్, డిఐఒఎస్ గురువిరెడ్డి, రీ సర్వే డిటి కృపావతి, ఆర్ఐ సాదక్ వలి, మండల సర్వేయర్ వాసుదేవరెడ్డి, టిడిపి నాయకుడు చంద్రమౌళి, వైసిపి నాయకులు, మాజీ సర్పంచ్ ముంగర సుబ్బయ్య, రేఖం నారాయణ, తిమ్మారెడ్డి పంది ళ్ళపల్లి బలరామయ్య, గ్రామ సచివాలయ సర్వేయర్లు, మోహన్‌రెడ్డి, బాబు జాన్, సచివాలయ సిబ్బ ంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లపై కసరత్తు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లపైన మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన అన్ని గ్రామ పంచాయతీల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశానుసారం త్వరి తగతిన గ్రామాల్లో ఇంటి పన్నును వసూలు చేయాలన్నారు. గతంలో కూడా ఇంటి పన్ను వసూళ్ల ఉండేవని గ్రామ పంచాయతీలే చెల్లించేవని అన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ వారు నివాసం ఉంటున్న ఇంటికి పన్ను చెల్లిం చాలని లేని యెడల వారికి నోటీసులు ఇవ్వ డం జరుగుతుందని తెలి పారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గాలివీడు

మండలానికి సంబంధించి ఎస్‌సి కార్పొరేషన్ కింద రెండు ఆటోలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు తెలిపారు. ఆటో లైసెన్స్ కలిగి ఉండి అనుభవం కలిగి ఉన్న యువకులు మే 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మండలానికి ఎపిజిబి బ్యాంకు ఒక ఆటో, ఎస్‌బిఐ బ్యాంకుకు ఒక ఆటో మంజూరు అయ్యిందని తెలిపారు. మూడు లక్షల రూపాయలు రుణ సదుపాయం అయితే రూ.1.85లక్షలు బ్యాంకు రుణం, రూ.15వేలు కాంట్రిబ్యూషన్ ఫీజు, రూ.లక్ష రూపాయలు సబ్సిడీ వర్తిసుందని తెలిపారు. మండలంలో మొత్తం 50 వేల జనాభా ఉన్నారని, అందులో 17 గ్రామ పంచాయతీలలో ఎస్‌సి జనాభా అధికంగా ఉన్నారని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇంత పెద్ద మండలానికి కేవలం రెండు ఆటోలను మాత్రమే మంజూరు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

'ఉపాధి' కూలీలకు బీమా తప్పనిసరి

ప్రజాశక్తి -చిట్వేలి


ఎపిఒ నాగరాజు

మండల పరిధిలోఉపాధి జాబ్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తి బీమా చేయిం చుకోవాలని ఎపిఒ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎపిఒ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీ వారికి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ ను కలిసి అప్లికేషన్ నింపి తిరిగి మీ ఫీల్డ్ అసిస్టెంట్‌కి ఇవ్వాలని కోరారు. మొదట ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో ఏడాదికి రూ.20లు కడితే, రెండు లక్షల బీమా ఉంటుందని ఇందులో యాక్సిడెంట్, డెత్‌కు బీమా వర్తిస్తుందన్నారు. రెండవది ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో ఏడాదికి రూ.436లు చెల్లిస్తే రూ.2 లక్షల రూపాయల బీమా వర్తిస్తుందని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కానీ, మేట్‌కు కానీ బీమాకు సంబంధించిన డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, మీరు ఇచ్చే ఫామ్ లోనే మీ అకౌంట్ నుంచి నగదును కట్ చేసి బీమా వర్తించే విధంగా తాము బాధ్యత తీసుకుంటామని అన్నారు. బీమాకు సంబంధించిన ఫామ్ ఈనెల 30వ తేదీ లోపు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు అందించాలని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న గ్రామపెద్దలు

మే 12 నుంచి గాలీటమ్మ జాతర

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పక్కిరారెడ్డిగారిపల్లికి చెందిన ప్రజలందరూ మంగళవారం సాయంత్రం గాలీటమ్మ గుడి వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో జాతర మే 12, 13 తేదీల్లో నిర్వహించడానికి గ్రామస్తులందరూ తీర్మానం చేసినట్లు తెలిపారు. 5న గాలిటమ్మను బయటకు తీసి 6న వీరభద్ర వాస్తవ్యులు గాలిటమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ , ఊరేగింపు కార్యక్రమం చేపడతారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి. య దు భూషణ రెడ్డి, ఆలయధర్మకర్త హేమకుమార్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గొట్లమిట్ట సాయి నాథ ోడ్డి, నర్సారెడ్డి మల్రెడ్డి, శివారెడ్డి, లోకయ్య, నరసింహారెడ్డి, మిట్టపల్లి గోపి క్రిష్ణరెడ్డి, మహేష్, వెంకట్‌రమణ, సూరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మెరిసిన చాపాడు విద్యార్థి

ప్రజాశక్తి - చాపాడు

తెలంగాణ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాల్లో మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన నంద్యాల నేహావర్ధిని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంఇసి విభాగంలో 495/500 మార్కులు సాధించింది. నేహ వర్ధిని అన్నవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ఎన్.లోకేశ్వర్‌రెడ్డి కుమార్తె. పదవ తరగతి ప్రొద్దుటూరులో అభ్యసించి 589/600 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. హైదరాబాదులోని లక్ష్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న నేహ వర్ధిని ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఇఒ


విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న ఎంఇఒ రవీంద్రనాయక్

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఇఒ రవీంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లి గ్రామపంచాయతీలో ఊరమాదిగపల్లె, జెసి కురవపల్లె, గుండ్లపల్లె ప్రాథమిక పాఠశాల పరిధిలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల తల్లి దండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభు త్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం, చక్కటి పాఠశాల గదులు ఉంటాయని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యా బోధన అందిస్తారని అన్నారు. విద్యార్థులు ఆడు కునేందుకు విశాలమైన క్రీడా మైదానం ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, స్కూల్ బ్యాగు ప్రభుత్వం ఉచితంగా అంది స్తుందని తెలిపారు. వారి పెరుగుదలకు పౌష్టికాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తుందని అన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగించి వారి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఇన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహిం చారు. ఊరమాదిగపల్లె ఐదుగురు, గుండ్లపల్లెలో ఇద్దరు, జెసికురవపల్లిలో ముగ్గురు పిల్లలను ప్రాథ మిక పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమ్లానా యక్, గిరిప్రసాద్, నాగమణినాయక్, ఆదినారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

పుల్లంపేట : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పుల్లంపేట ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం పుల్లంపేట మండలం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అప్పయ్య రాజుపేట, పెరియవరం ఏ డబ్ల్యు ప్రాథమిక పాఠశాలలు కలసి అప్పయ్యరాజుపేటలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం పాఠశాలల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి విజ్ఞానాన్ని పెంచుకొని మంచి మార్కులు తెచ్చుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సమావేశానికి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సర్వరపల్లి, పంచాయతీ ఉపసర్పంచ్ సయ్యద్‌ముస్తాక్, గ్రామ పెద్దలు సయ్యద్ ముక్రంచాంద్, మండల విద్యాశాఖ సిబ్బంది సిఆర్ఎంటిలు, పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు, టి.ఝాన్సీ, విజయరాణి, ఉపాధ్యాయులు సత్యనారా యణరాజు, మురళి,కరణం హైమావతి, సుబ్బలక్ష్మి, సుజాత, శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ చక్రధర్‌రాజు

ముగిసిన పౌష్టికాహార పక్షోత్సవాలు


కలికిరి : గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండల కేంద్రంలో మంగళవారం మహల్ పంచాయతీ తూర్పుపల్లిలో సూపర్వైజర్ సర్తాజ్ ఆధ్వర్యంలో ఏడవ రోజు పౌష్టికాహార పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పౌష్టికాహార ఉత్సవాలు విజయవంతంగా ముగిసాయని, ఈ కార్యక్రమానికి సహకరించిన అంగన్వాడీ కార్యకర్తలకు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బండకాడపల్లి-2 అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక పక్షోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలు మొదట వెయ్యి రోజుల గర్భస్థ దశ నుంచి రెండు సంవత్సరాల వరకు వారి సంరక్షణపై శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు స్వయంగా తమకు తామే వారికి సంబం ధించిన సమాచారాన్ని పోషణ ట్రాక్‌లో నమోదు చేసుకోవడానికి వీలు కల్పించినట్లు తెలి పారు. కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ అమలు చేయడం ద్వారా పోషకాహార లోపాలను తగ్గించుకోవడానికి వారికి అవగాహన కల్పించడం, చిన్నపిల్లలలో ఊబకాయాన్ని తగ్గిం చడానికి ఆరోగ్యపరమైన జీవనశైలిని అలవాట్లను నేర్పించుట లాంటి నాలుగో అంశాలపై గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో అంగన్వాడీ కార్యకర్తలు అమ్మాజీ, ఎవి.ప్రసన్న, రెడ్డిరాణి, జి.పార్వతి, సూర్యకళ, తిరుమల, శ్రీలత, ప్రమీలభాయ్, పి.రాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** పౌష్టికాహారం తీసుకోవడం వలన వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొం దడమే కాక పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని సిడిపిఒ నాగవేణి పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆర్ఎన్ తండా అంగన్వాడీ కేంద్రంలో పండ్లు, కూరగా యల దినోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయలు, పౌష్టికాహార వంటల స్టాల్స్ ఏర్పాటు చేసి వాటి ప్రాధాన్యతను గర్భిణులు, చిన్నారుల తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

సిఎం సహాయనిధి పేదలకు వరం లాంటిందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలానికి సంబంధించిన ముక్కావారి పల్లి పంచాయతీ, అమృతవారిపల్లి గ్రామానికి చెందిన అమృతాల కృష్ణవేణమ్మకి రూ.48,786 లు, ఐఎల్‌రాజుపల్లి గ్రామానికి చెందిన మల్లు రమ ణారెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.06లక్షలు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితుల ఇంటి వద్దకు వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఎప్పుడు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పేద, బడుగు, మధ్యతరగతి వారు ఆరోగ్యం బాలేనప్పుడు అప్పులు చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతారని పేర్కొన్నారు. అటువంటి బాధితులకు సిఎం సహాయ నిధి కింద డబ్బులు వచ్చినప్పుడు వారి కుటుంబాలు సంతోషంగా ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా సరే ఆస్పత్రి బిల్లులు తీసుకుని వచ్చి తమను సంప్రదిస్తే వారికి సిఎం రిలీఫ్ ఫండ్ వచ్చే విధంగా చర్యలు తీసు కోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇవ్వడం పట్ల బాధితులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పేదల అభివృద్ధి సంక్షేమం కోసం అహ ర్నిశలు కృషి చేస్తున్న ముక్కా కుటుంబానికి నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని బాధి తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్‌పై సంబరాలు


కేక్‌కట్ చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ములకలచెరువు

ఉక్కు సంకల్పంతో కూడిన మంద కృష్ణ మాదిగ పోరాటం, చంద్రబాబు, మోడీ సహకారంతోనే ఎస్‌సి వర్గీకరణ సాధ్యమైందని ఎంఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఎంఆర్‌పిఎస్ తంబ ళ్లపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ప్రతాప్‌కుమార్, నియో జకవర్గ ఇన్‌ఛార్జి తిరుపాల్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు ములకచెరువు టౌన్ మూడు రోడ్ల కూడలి సర్కిల్ వద్ద మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డినెన్స్ ద్వారా ఎస్‌సి వర్గీ కరణను అమలు చేసి, 59 ఎస్‌సి ఉపకులాలకు జనాభా దమాషా ప్రకారం న్యాయం చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వం జిఒ తేవడం హర్షణీయమని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎస్‌పి జాతీయ నాయ కులు సొట్టా నరేంద్రబాబు మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా మాదిగలకు జరిగిన అన్యా యాన్ని సరిదిద్దడానికై 30 ఏళ్లు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంఆర్‌పిఎస్ చేసిన పోరాటం, స్వాతంత్రోద్యమం తర్వాత అంతటి గొప్ప ఉద్యమం గా నిలిచిందన్నారు. ఎన్నో సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు తపన, ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండాలనే నిజాయితీ, నిబద్ధత ఉందని కొనియాడారు. దేశ చరిత్ర లోనే మొట్టమొదటి సారిగా ఒక కుల సంఘం పెట్టిన సమావేశానికి ప్రధానమంత్రి వచ్చారని అన్నారు. ఎస్‌సి వర్గీకరణకు అండగా నిలిచిన మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రత్యే కంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ స్ఫూర్తితో పేద వర్గాల కోసం ఆరోగ్యశ్రీ, వికలాం గుల, వృద్ధుల, వితంతువుల పక్షాన మరిన్నీ ఉద్యమాలకు సిద్ధపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు మాజీ జడ్‌పిటిసి ఈశ్వరప్ప, నాయకులు వెంకటప్ప, చౌడప్ప, ఎంఇఎఫ్ నాయకులు టీచర్ ఆదినారాయణ, టీచర్ నరసింహులు, శివన్న, చిన్న రామయ్య, సీనియర్ నాయకులు రామప్ప, గట్టు రమణ, తంబళ్లపల్లి మండ ల ఇంచార్జ్ యాట మల్లికార్జున, ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం బి.కొత్తకోట సిఐ జీవన్‌గంగనాథ్‌బాబు మండలంలోని రౌడీషీటర్లు అందరిని స్టేషనుకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మండలంలో ఎలాంటి నేరాలు చేయ కుండా మంచి పరివర్తనతో మెలగాలని, నేరాలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని, రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. మండలంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పేందుకు ప్రజల సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

పులివెందుల రూరల్ : ప్రభుత్వ కళాశాలల ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ అధికారి ఆదేశాల మేరకు కడప జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో పులివెందుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అయిదు మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. గ్రామీణ కళాశాల విద్యార్థులు ఇలాంటి ఉద్యోగాలను పొందడం ఇతరులకు ఆదర్శమన్నారు. కళాశాల నుండి ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాధికా నాయకత్వంలో 8 మంది విద్యార్థులు హాజరవ్వగా అందులో ఐదుగురు బికామ్ విద్యార్థులు వసంత, సింధు, నీలిమ, చందన, మేరీ ఉద్యోగం సంపాదించడం చాలా గర్వకారణమన్నారు. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.బాలనారాయణ, అధ్యాపకులు అభినందించారు.


చెట్లను నరక వద్దని సూచిస్తున్న గ్రామస్తులు

నీడనిచ్చే చెట్లను నరికితే సహించం

ప్రజాశక్తి-నందలూరు

విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం నీడనిస్తున్న చెట్లను నరికితే ఊరుకోమని పాటూరు గ్రామపంచాయతీ పరిధిలోని శివరాంపురం, ఎర్రిపాపయ్యగారిపల్లె గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాటూరుకు వెళ్లే దారిలోని శివరాంపురం వద్ద విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని కానీ ఎందుకనో కాంట్రాక్టర్ చెట్ల మధ్యలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటి ప్రజలకు మేలు చేయాలని సూచిస్తుంటే, దాదాపు 50 సంవత్సరాలు పాటు వయసు కలిగిన చెట్లను విద్యుత్తు లైన్ ఏర్పాటు కోసం నరకటం ఏమిటని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో మండలంలోని నీలిపల్లె గ్రామంలో విద్యుత్తు లైన్ కోసం ఇలాగే చెట్లను ఇష్టం వచ్చినట్టు నరకడంతో విద్యుత్ శాఖపై కేసులు నమోదు చేశారని తెలిపారు. ఇక్కడ కూడా కాంట్రాక్టర్ తిరిగి అదే తప్పు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్తు లైను చెట్ల మధ్య నుంచి కాకుండా వేరే మార్గంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువల్లేక ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో చాలా గ్రామాల్లో డ్రెయినేజీ కాలువలు లేక మురుగునీటి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 17 గ్రామాలు ఉన్నాయి. మేజర్ పంచాయతీలైన గాలి వీడు, అరవీడు, గోరాన్ చెరువు, నూలివీడు, గాలివీడులో ప్రధాన రహదారిపై మినహా వీధుల్లో మురుగు కాలువలు లేకపోవడంతో సిమెంటు రోడ్డుపైన ఇంటిలోని వెలువలే వ్యర్థాలో నీరంతా పారుతోందని చెబుతున్నారు. గ్రామాల్లో సిమెంటు ఉన్నాయి గానీ కాలువలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి మొదట సిసి రోడ్ ఏర్పాటు చేసినప్పుడే ఆ పక్కనే మురుగు కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

25న పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల ప్రజా పరిషత్ సభ భవనంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎఒ శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు అందరూ హాజరు అవుతారని అన్నారు. మండలానికి సంబంధించిన అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని సూచించారు. మండల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుం దని, కావున ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హాజరుకావాలని ఆయన కోరారు. ప్రతి అధికారి తమ శాఖపై పూర్తి సమాచారంతో సభకు హాజరుకా వాలని కోరారు.

పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-ములకలచెరువు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు తోట గిరిధర్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల గోశాల వ్యవహారంలో మాజీ మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని అన్నారు.

సమస్యను రాజకీయం చేయొద్దు

ప్రజాశక్తి- వేంపల్లె

భార్యభర్తల సమస్యను కొందరు వ్యక్తులు రాజకీయం చేయడంతో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, ఇది మంచిది కాదని పఠాన్ మునవర్, ఖాసీం వలి పేర్కొన్నారు. మంగళవారం నందిపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వీరపునాయునిపల్లె మండ లం లోని నేలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన పెద్ద బాదుల్లా కుమార్తె షీరిన్ భాను ను వివాహం చేసుకున్నట్లు చెప్పారు. అయినప్పటి నుంచి బార్యభర్త మధ్య విభేదాలు లేవు.. భార్యను ఎప్పుడూ హించంచలేదని మునవర్ తెలిపారు. చిన్న మాట విషయంలో తన భార్య షీరిన్ పుట్టింటికి వెళ్లిందని చెప్పారు. పెద్ద మనుషులను తీసుకొచ్చి సంజాయిషీ చెప్పకపోగా చిన్న బాదుల్లా అనే వ్యక్తి ఘర్షణ జరగడానికి మూల కారణమన్నారు. చిన్న బాదుల్లా అనే వ్యక్తి రాజకీయం చేసి వేంపల్లెలోని బిడ్డాలమిట్ట ప్రాంతంలో ఉన్న అబ్దుల్‌తోపాటు మరి కొందరిని పిలుచుకొచ్చి తమ కుటుంబంపై దాడి చేశారని తెలిపారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో తాము ప్రాణాలతో బయట పడ్డామన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయాలకు అంటగట్టడం సరైందికాదన్నారు.

చంద్రబాబు హయాంలోనే షాదీఖానా ఏర్పాటు

- హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్ బాషా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

చంద్రబాబు హయాంలోనే పులివెందులకు షాదీఖానా వచ్చిందని హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాల యంలో మంగళవారం ఆయన ముస్లిం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి మాట్లాడిన మాటలు అవాస్తవమని వైసిపి ముస్లిం నాయకులు అనడం దురదృష్టకరమన్నారు. 2010లో ముస్లింలు ఈద్గా ఏర్పాటుకు 2.62 సెంట్ల భూమిని అప్పజెప్పారని, ఒక వైసిపి రౌడీషీటర్ ఆ భూమిని ఆక్రమించి, ఈద్గాను ధ్వంసం చేశారన్నారు. ఆ ఈద్గాను అప్పట్లో వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారన్నారు. ఈద్గా ఏర్పాటుకు భూమిని వైఎస్ కుటుంబ సభ్యులు అప్పజెప్పలేదన్నారు. బీటెక్ రవి ఒక సమావేశంలో ఈద్గా ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. వైఎస్ కుటుంబ సభ్యులు ఈద్గా ఆక్రమించిన వైసిపి రౌడీషీటర్‌కు డబ్బులు ఇచ్చారేమో కానీ.. అసలైన భూ యజమానులకు ఇవ్వలేదన్నారు. వైసిపి ముస్లిం నాయకులు వాస్తవాలు మాట్లాడాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు రహంతుల్లా, నాగిన్ బాషా పాల్గొన్నారు.

8న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా జడ్‌పి సర్వసభ్య సమావేశం మే 8న నిర్వహించనున్నట్లు జడ్‌పి సిఇఒ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం కొనసాగుతుందని తెలిపారు. జడ్‌పిటిసిలు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

బాలింత ఆకస్మిక మృతి

- సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బాలింత ఆకస్మికంగా మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే బి.కొత్తకోట మండలం,కోటావూరు పంచా యతీ, బూదలవారిపల్లికి చెందిన గాయత్రి (25) తన భర్త ఆర్‌సి.రాజేష్‌తో కలిసి లగేరి, బెంగళూరులో కాపురం ఉంటున్నారు. గర్భిణిగా సొంత గ్రామం బూదల వారి పల్లిలో ఉంటూ బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయింది. తర్వాత ట్యూబెక్టమి ఆపరేషన్ చేయించుకుంది. అనంతరం కడుపునొప్పి ఎక్కువగా ఉండ డంతో 19న ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంది. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం పెద్ద ఆసుపత్రికి పంపగా చికిత్స పొందుతూ న సోమవారం రాత్రి మృతి చెందింది. బాలింత మృతికి కారణం తెలియలేదు. మృతురాలి అన్న రెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.